# కష్టపడి చదివితే విజయం

కలెక్టర్ హనుమంతరావు ఉద్బోధ

భరత్ చంద్ర విద్య కోసం సహాయం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని శేరి గూడెం గ్రామంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఉదయం ఐదు గంటల సమయంలో తలుపు తట్టే కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు. వేకప్ కాల్ చేసి విద్యార్థి ఇంటి డోర్ కొట్టి విద్యార్థిని నిద్రలేపి కలెక్టర్ భరత్ చంద్ర చారి అంటూ విద్యార్థిని పిలుచు కుంటూ విద్యార్థి ఇంటికి కలెక్టర్ స్వయంగా వెళ్లారు. విద్యార్థికి నా సొంత ఖర్చులతో పదవ తరగతి ఎగ్జామ్స్ వరకు ప్రతి నెల రూ.5 వేలు ఇస్తా అని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి నెల రూ.5 వేలు భరత్ చంద్రకు అందజేశారు. విద్యార్థికి చదవడానికి ఒక చైర్ , రైటింగ్ ప్యాడ్ ఇచ్చారు. నేను జిల్లా కలెక్టర్‌ని ఎలా చదువుతున్నారంటూ విద్యార్థితో మాట్లాడినారు. పదవ తరగతి అనేది విద్యార్థికి మైలు రాయి లాంటిదని మీ అమ్మ నిన్ను ఇంత కష్టపడి చదివిస్తునందుకు నువ్వు పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి మీ అమ్మకి సంతోషాన్ని ఇవ్వాలని సూచించారు. పదవ తరగతిలో కష్టపడి చదివి పాస్ అయితే జీవితంలో విజయానికి తొలి మెట్టు అవుతుందనీ కష్టపడి చదివి తల్లితండ్రులకు, గురువులకు, జిల్లాకి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. భరత్ జీవితంలో స్థిరపడేవరకు సహకారం అందిస్తానని తెలిపారు. తల్లి విజయ లక్ష్మి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. భరత్ తనకి పోలీస్ ఆఫీసర్ కావాలని ఉందని కష్టపడి సాధిస్తానని కలెక్టర్ స్వయంగా ఇంటికి రావటం నమ్మలేక పోతున్నానని కలెక్టర్ సర్ రావటంతో తనలో ఆత్మ విశ్వాసం పెరిగిందని బాగా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని తెలిపాడు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు బచ్చనగోని సుభాష్, పగిళ్ల శ్రీను పాల్గొన్నారు.

## జిల్లా ఆర్బీఎస్‌కె సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా కలెక్టర్ అధ్యక్షతన , డీఎంహెచ్ఓ డా.మనోహర్ సమక్షంలో ఆర్బీఎస్‌కె బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో ఆర్బీఎస్‌కె ప్రోగ్రాం యొక్క అన్ని అంశాలను సమీక్షించడంతో పాటు, అనేక కీలక సూచనలు జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతు రావు మాట్లాడుతూ ఆర్బీఎస్‌కె బృందాలు రక్తహీనత (అనీమియా) గల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, క్రానిక్ రోగాలకు సంబంధించిన లైన్ లిస్టును సిద్ధం చేయాలన్నారు. కళ్ల పరీక్షల మొదటి మరియు రెండవ దశల అమలు తీరును సమీక్షించి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రతి పాఠశాలలో హేమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, హెచ్‌బి టెస్టింగ్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని, జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు రావు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్, జిల్లా ఆర్బీఎస్‌ఎ బృందం సభ్యులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# కృష్ణ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** కులం పేరుతో ఇటీవల వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం ఆయనతో పాటు కమిషన్ సభ్యులు బంటి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి తమకు అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. అనంతరం బంటి హత్య కేసు పురోగతిపై అధికారులతో చర్చించి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంటిని హత్య చేసిన వారిపై పెట్టిన కేసును వెనక్కి తీసుకుంటే రూ. 2కోట్లు ఇస్తామని లేకపోతే చంపెస్తామని బెదిరిస్తున్నారని కుటుంబ సభ్యులు తమ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. కుటుంబ సభ్యులకు వెంటనే రక్షణ కల్పించాలని పోలీస్ అధికారులను సూచించారు. బాధిత కుటుంబానికి రూ. 4లక్షల నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. బంటి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, చట్టం ప్రకారం నిత్యావసర సరకులు, తక్షణ సహాయం అందజేయాలన్నారు. పింఛన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఐదు ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతినెల చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవం జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు, ఆర్‌డిఓ వేణుమాధవ్, ఎస్‌సి సంక్షేమ అధికారి లత, అధికారులు, సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు కోట గోపి, ధరావత్ బాలు నాయక్ పాల్గొన్నారు.

## నేడు బుద్ధవనంలో త్రిపీటక పఠనోత్సవం



**ప్రజాపక్షం/నందికొండ:** నేడు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా మహాబోధి సొసైటీ సికింద్రాబాద్ అదే విధంగా అంర్జాతీయ త్రిపీటక సంగాయన మండలి సంయుక్తంగా,త్రిపిటక పఠనం జరుగుతుందని బుద్ధవన నిర్వాహకులు తెలిపారు.బౌద్ధ ధార్మిక, సాంస్కృతిక, సాంప్రదాయాలను, పరిరక్షించి, కొనసాగించాలన్న ఉద్దేశంతో, నేడు 108 మంది బౌద్ధ భిక్షువులతో, నిర్వహించే ఈ పఠన కార్యాక్రమానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం బుద్ధవనం సహకారాన్ని అందిస్తుందని అన్నారు . ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు కూడా భాగస్వాములై బుద్ధవచనాన్ని వినే అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 3నామినేషన్లు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వరంగల్,ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లలో భాగంగా గురువారం ముగ్గురు అభ్యర్థులు వారి నామినేషన్లను దాఖలు చేసినట్టు నల్లగొండ జిల్లా కలెక్టర్,వరంగల్,ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు.గురువారం నామినేషన్లు వేసిన వారిలో ప్రజావాణి పార్టీ తరఫున లింగిడి వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారని, స్వతంత్ర అభ్యర్థులుగా అర్వ స్వాతి, చాలిక చంద్రశేఖర్లు చెరో సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కలెక్టర్ తో పాటు ఉన్నారు.

## సిపిఐ అభ్యర్థులను గెలిపించండి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (గరిడేపల్లి) :** ప్రజల మధ్య ఉంటూ,ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతం కృషి చేస్తున్న సిపిఐ పార్టీ కార్యకర్తలను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసింది,చేసేది సిపిఐ పార్టీనేనని గుర్తుచేశారు. ఏ స్వార్ధం లేకుండా నిస్వార్ధంగా పనిచేసేది కమ్యూనిస్టులేనన్నారు. తమ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సిపిఐ పార్టీ అభ్యర్థులను సర్పంచ్,ఎంపిటిసి,జడ్పిటిసిలుగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్ రెడ్డి,మండల కార్యవర్గ సభ్యుడు ఎడ్ల అంజిరెడ్డి,కడియాల అప్పయ్య,కుందూరు వెంకటరెడ్డి,పంగ సైదులు పాల్గొన్నారు.

## 12 క్వింటాళ్ల నల్లబెల్లం, 350కిలోల పట్టిక పట్టివేత



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** నిషేదిత నల్లబెల్లం 12 క్వింటాలు, 350కిలోల పట్టికను అక్రమంగా బోలోరో వాహనంలో తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకొని సీజ్ చేసిన సంఘటన తుంగతుర్తి సర్కిల్ పరిధిలో చోటు చేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం అసిస్టెంట్ కమిషనర్ బి సంతోష్ ఆధ్వర్యంలో సారా నిర్మూలనలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వెలిశాల ఎక్స్ రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి బోలోరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 12 క్వింటాల నల్లబెల్లం, 350కిలోల పట్టిక ఉండడంతో దాన్ని సీజ్ చేసి అందులోని వ్యక్తులను ఆదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాహన డ్రైవర్ ననావత్ సాహు, కర్నాలకుంటతండాకు చెందిన గుగులోతు యాకన్నను అదుపులో తీసుకోగా నవీన్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ పి గోపాల్, హెడ్ కానిస్టేబుల్స్ యాకుబ్, అన్సర్, బ్రహ్మం, ప్రశాంత్, మనోహర్ పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందికి జీతాలు ఇవ్వండి

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు అందక కుటుంబాల గడపడం కష్టంగా మారిందని అధికారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. నవంబర్ డిసెంబర్ జనవరి జీతాలు ఇవ్వాల్సి ఉండగా విధుల నిర్వమణలో రవాణా చార్జీల సైతం సమస్య ఏర్పడిందని వారు తెలిపారు. కూలీలకు పనులు కల్పించేందుకు పనుల ఎంపిక తదితర ప్రక్రియ బాధ్యత నిర్వహణలో పనిచేస్తున్న అధికారులకు జీతాలు లేనందున కడుపులు కా ల్చుకుని ఉపవాసాలు ఉంటూ చేతిలో చిల్లి గవ్వ కూడా లేక అప్పులు దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా ప్ర భుత్వం ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఏపీ వాళ్లకు టిఏలకు ఆపరేటర్లకు వెంటనే జీతాలు విడుదల చేయాలని వా రు డిమాండు చేశారు. మిగతా అధికారులకు నెలల జీతాలు ఇస్తూ మిమ్మ ల్ని ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని కుటుంబాలతో సహా ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లల చదువులు ఫీజులు కట్టలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకత పెరగాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** సాహిత్య రంగంలో విద్యార్థులు ముందు వరుసలో నిలవాలని, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే దిశగా సృజనాత్మక ఆలోచనలు వారిలో పెంపొందించాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ప్రముఖ కవయిత్రి ఉప్పల పద్మ సంపాదకత్వంలో ప్రచురించబడిని 'మంత్ర దండం' పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటి కాలేజ్ ఆఫ్ టెక్నాలజి అధ్యాపకులు డాక్టర్ సాదం ఐలయ్య, ఎస్‌సిఈఆర్‌టి అధ్యాపకులు పఠాన్ ఎఫ్ ఖాన్, పల్లెర్ల సురేందర్, చిలుకూరి మధు, నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల కంపెనీల నుండి రైతులను కాపాడాలి




రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** నకిలీ విత్తనాల కంపెనీల నుండి రైతులను కాపాడాలని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించిన వారు నష్టానికి కారకులైన గరిడేపల్లి మండలం గడ్డిపల్లి చరణ్, ఎంఎస్ వెంకటసాయి సీడ్స్ కంపెనీల యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు వారి నుండి సిరి 101, కావేరి సింట్లు అనే రకం వరి విత్తనాలు కొనుగోలు చేసి నాటు పెట్టిన 15రోజులకే పంట ఈనడంతో రైతులు తీవ్ర నష్టపోయారన్నారు. కంపెనీ యజమానుల డిలర్‌షిప్‌ల అనుమతి ఉన్న వారు విత్తనాల కంపెనీలు మాత్రమే విత్తనాలు అమ్మేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, సునీల్, భవానీ, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం / నల్లగొండ టౌన్ :** నల్లగొండ సమీపంలోని రాములబండ తండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రసవాలతోపాటు, పేద ప్రజలకు ఇంకా మంచి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.గురువారం ఆమె రాములబండ తండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లను, సౌకర్యాలను అన్నిటిని పరిశీలించారు.ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మంచి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ప్రసవాల సంఖ్యను పెంచాలని, అలాగే వైద్య పరీక్షలు, ఓపిని పెంచాలని ఆమె సూచించారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాములబండ తండా పిహెచ్‌సిలో స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ లేనందున ఇబ్బందిగా ఉందని ,స్టాఫ్‌నర్స్‌తో పాటు,ల్యాబ్ టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాలని కోరగా, తక్షణమే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఉన్నారు.






## రిజర్వాయర్ పనులను అడ్డుకున్న ముంపు గ్రామస్తులు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** శివన్నగూడ రిజర్వాయర్ లోని నర్సిరెడ్డిగూడెం ముంపు గ్రామస్తులు గురువారం ప్లాట్లు, ప్యాకేజీ, రానివారు పనులు జరగకుండా అడ్డుకున్నారు. గ్రామానికి కరెంటు, ఫోన్ సిగ్నల్స్ రాకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తన గోడు వెలిబుచ్చారు. గ్రామాన్ని, విడిచిపెట్టి అనాధలై వెళ్ళిపోతున్నందున ప్రభుత్వము నుండి ఇబ్బందులు లేకుండా ఆదుకోవాలని కోరారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



కబడ్డీ పోటీలను ప్రారంభించిన డిఎస్‌పి శివరాం రెడ్డి

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా నిర్వాహిస్తున్న కబడ్డీ పోటీలను నల్లగొండ డిఎస్‌పి కె శివ రామరెడ్డి ప్రారంభించారు. గురువారం స్థానిక జెడ్ పి ఎచ్ ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల ప్రారంభానికి ముఖ్య అతిధి గా అయన విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంను యువత లోని క్రీడా స్ఫూర్తి ని బయటకు తీసుకొస్తుందని, అదేవిధంగా వారి యొక్క ప్రతిభను కనబరుస్తున్నదని వివరించారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం క్రీడాకారులకు అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో నార్కట్పల్లి సిఐ కే, నాగరాజు, ఎస్సై డి. క్రాంతి కుమార్, మండల విద్యాధికారి కె .నరసింహ, ప్రధాన ఉపాధ్యాయులు రాములు, మండల యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రీడలతోనే యువతలో స్నేహభావం : ఎస్‌పి

**ప్రజాపక్షం /హాలియా:** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను గురువారం హలియాలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ప్రారంభించారు . ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ఏర్పాటు చేసిన క్రీడల వల్ల గ్రామీణ యువతకు పోలీసులకు మధ్య స్నేహ భావం పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా యువత ఉత్సాహవంతంగా అన్ని మండలాల పరిధిలో కలిపి దాదాపు 370 టీమ్ లు నమోదు చేసుకోవడం జరిగిందనీ వీరందరికీ మండల, డివిజన్ పరిధిలో ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన జట్లను జిల్లా స్థాయిలో నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర రాజు, హలియ సిఐ జనార్ధన్ గౌడ్, యస్.ఐలు గోపాల్ రావు, ప్రసాద్,మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి వ్యాయామ ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.



## లంబాడీల వాహనాల సబ్సిడీని విడుదల చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** వాహనాలు కొనుగోలు చేసిన లంబాడిలకు ప్రభుత్వం నుండి రావాల్సిన సబ్సిడీని ప్రభుత్వం వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని లంబాడి విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు ధరావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలు నాయక్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి వివిధ వాహనాలు కొనుగోలు చేసిన లంబాడిలకు పరిశ్రమల శాఖ నుండి రావాల్సిన సబ్సిడీని విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతురన్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర కార్యదర్శి బాణోతు సురేష్ నాయక్, మాజీ సర్పంచ్ రాజు నాయక్, బాణోతు భగవాన్ నాయక్, నరసింహ నాయక్ పాల్గొన్నారు.



## కుక్కలు చింపిన విస్తరిలా కాంగ్రెస్ పాలన



మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాష్ట్రంలో కుక్కలు చింపిన విస్తరిలా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదని ఆరోపించారు. అధికారంలో వచ్చి 14నెలలు గడుస్తున్న ప్రజలను పట్టించుకోకుండా కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కెసిఆర్ చేపట్టిన సర్వే ఎఫెక్ట్ రేవంత్ సర్వే అంత బోగస్ అని స్వంత పార్టీ నాయకులే అంటున్నారని చెప్పారు. దేశ విదేశాల నుండి స్వచ్ఛందంగా తరలి వచ్చి కెసిఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనారని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్వే అంటే తరుముతున్నారని ఎద్దేవ చేశారు. కుల గణన సర్వే వివరాలను వెబ్ సైట్‌లో పెట్టిన వెంటనే లాక్ చేసింది మీరా కాదా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జనాభాను తగ్గించి చూపితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గ్రహించడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తుందన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పట్ల ప్రజల్లో సానుకూలత లేకపోవడంతో పాలకులు డిలాపడ్డారన్నారు. చివరకు మాదిగలు చేపడుతామని చెప్పిన లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి అసెంబ్లీని నిర్వహించారన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు మొదలైందన్నారు. ఇకనైనా చెంపలు వేసుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ పెద్దలను డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్, కెసిఆర్ పై ఆరోపణలు మాని అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు.

## శేష వాహనంపై ఊరేగిన పార్వతీ పరమేశ్వరులు

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మండలంలోని చెరువుగట్టు గ్రామంలో ప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం తెల్లవారుజామున శేష వాహనంపై స్వామివారి సేవా కార్యక్రమంను దేవస్థాన ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, దేవస్థాన కార్య నిర్వహణ అధికారి నవీన్ కుమార్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివపార్వతులకు తెల్లవారుజామునుండే గవ్యాంత మర్జనలు,సూర్య నమస్కారాలు,దీక్ష హోమములు, రుద్ర హోమము,బలిహరణ, సదస్యం పేద స్వస్తి సరస్వతి పూజ,మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,మహా నివేదన, నీరాజన మంత్రపుష్పము ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.

**తెల్లవారితే స్వామి వారి అగ్ని గుండాలు:** చెరువు గట్టు శ్రీ పార్వతి జడ రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ప్రధానమైన కళ్యాణ ఘట్టం అనంతరం అగ్నిగుండాల ఘట్టం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఈ అగ్నిగుండాలలో గుండా భక్తులు నడిచి వెళితే సకల పాపాలు ప్రలదోలునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఘట్టం సోమవారం తెల్లవారుజామున జరగనున్నది.



# ఈ నెల 10వ తేదిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం

కలెక్టర్ క్రాంతి వల్లూరు




**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి:** ఈ నెల 10వ తేదిన జిల్లాలో నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖతో పాటు సంబందిత శాఖలన్ని సమిష్టి గా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం ఐసిసి లోని మినీ సమావేశ మందిరంలో ఈ నెల 10 తేదిన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం 2025 పై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణి వంద శాతం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్బముగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 4,05,207 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఫిబ్రవరి 10న కార్యక్రమ ప్రారంభం అయ్యే ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ,కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు సంక్షేమ హస్టళ్లలో డివార్మింగ్ ట్యాబ్లెట్ పంపిణి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ గాయిత్రి జడ్పీసీఈఓ జానకిరెడ్డి, డిపిఓ సాయిబాబా బిసి సంక్షేమాదికారి జగదీష్, డీఈఓ వెంకటేశ్వర్లు సంబందిత శాఖల అదికారులు వివిధ ఎన్‌జిఓ ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి వార్షిక ఫలితాలలో జిల్లాను ముందంజలో ఉంచాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి:** పదో తరగతి వార్షిక ఫలితాలలో జిల్లాను ముందంజలో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో మండల విద్యాశాఖ అధికారులతో కలిసి ఉత్తమ ఫలితాల సాధన దిశగా చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, 10వ తరగతి పూర్తి అయిన తర్వాత ఉన్నత చదువుల దృష్ట్యా వివిధ మార్గాలను ఎంచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు. వార్షిక పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా సన్నద్ధం కావాలని, ఎలాంటి ఒత్తిడి, అపోహలు లేకుండా ఏకాగ్రతతో చదవాలని తెలిపారు. మండల విద్యాధికారులు ప్రతిరోజు 5 పాఠశాలలను సందర్శించాలని, ప్రధానోపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధన సరళిని పరిశీలించాలని తెలిపారు. పాఠ్యాంశాలు పూర్తి అయినట్లయితే తిరిగి సిలబస్ పఠనం చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, సమన్వయకర్త శ్రీనివాస్, మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాల్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/బోథ్:** బోథ్ మండల కేంద్రంలో వాహనాలను బోథ్ సిఐ వెంకటేశ్వర్ రావు, ఎస్ఐ ప్రవీణ్ లు పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా వాహనం పై నెంబరు ప్లేటు లేకుండా ఉన్న వాహనాలకు జరిమానా విధించారు. తప్పని సరిగా వాహన పత్రాలు లైసెన్స్ ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని లేని పక్షంలో జరిమానాలు విధించబడుతాయని తెలిపారు. చిన్న పిల్లలకు విద్యార్థులకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులను హెచ్చరించారు.

## అక్రమ మద్యం రవాణా.. దేశీదారుతో వ్యక్తి పట్టివేత



**ప్రజాపక్షం/సిర్పూర్(టి) :** మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన తనిఖీల్లో 240 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం, మహారాష్ట్రలోని గోండుబిబ్రి నుంచి సిర్పూర్(టి) మండలానికి మోటార్‌సైకిల్‌పై అక్రమంగా మద్యం తీసుకువస్తున్న చంద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని, మద్యం విలువ రూ.13,500 ఉంటుందని, మోటార్‌సైకిల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం రవాణా, విక్రయాల్లో పాల్గొన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని ఏఎస్ఐ రుక్సానా బేగం తెలిపారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో మెదక్ సిఐ నాగరాజు ఆదేశాల మేరకు ఏఎస్ఐ రుక్సానా బేగం, కానిస్టేబుల్ భాస్కర్ రవీందర్, డ్రైవర్ లక్ష్మణ్ తో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని, హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన గుడిశెట్టి కళావతి w/o బాలరాజ్ సంబంధించిన 32 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు బాధితులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్పొరేట్ వైద్యంలో చేయించుకొని కుటుంబ ఖర్చుల భారం పడకుండా ముఖ్యమంత్రి సహాయనిది కింద చెక్కును మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మా గౌడ్, లింగం గౌడ్, వెంకట్, సులేమాన్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు రిజర్వేషన్ కల్పించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కేంద్రంలో ప్రత్యేక బిసి రిజర్వేషన్ కల్పించాలని ధర్నా నిర్వహించారు. ప్రత్యేక బిసి కమిషన్ ఏర్పాటు చేసి, బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కామేడ్ ఎస్. విలాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఈ దేశంలో ప్రజలందరికీ జాతి కుల వర్గలింగ వివక్షత లేకుండా సమానత్వాన్ని సమాన అవకాశాలను కల్పిస్తామని, హామీ ఇచ్చింది కేంద్రంలో రాష్ట్రంలో సగానికి పైగా ఉన్న బిసిల జీవన ప్రమాణాలను పెరగకుండా ఎన్నటికీ అభివృద్ధి సాధ్యం కాదు అందుకుని సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి జరగాలంటే అన్ని రంగాలలో సంపద అంతా వికేంద్రీకరణ జరగాలని అన్నారు. ఈ సందర్భంగా డిమాండ్ చేస్తూ దేశ జన గణనలో కుల గణన జరపాలని ఈ పారమెంట్ సమావేశాల్లో నే బిసిలకు 50 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు పరచాలని కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రెండు లక్షల కోట్లతో బిసి సంక్షేమ అభివృద్ధి కొరకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్రంలో బిసి జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బడ్జెట్లో నిధులు జనాభా ప్రాతిపదికన కేటాయించాలి. ఉపాధి అభివృద్ధిపై ఖర్చు చేయాలి సబ్సిడీ రుణాలు వృత్తి దారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ ఎస్.విలాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి, కామ్రేడ్ భూక్య రమేష్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ శ్రీనివాసచారి బీసీ హక్కుల సంఘం నిర్మల్ శ్రీనివాస వర్మ, కాల్వ నరసయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సిఎల్‌పి సమావేశంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గురువారం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై చేపట్టిన చర్యలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు.



## పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** మండలంలోని అచ్చంపేట్ మోడల్‌స్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గురువారం రోజున సబ్ కలెక్టర్ కిరణ్మయి స్నాక్స్ అందజేశారు. అంతకుముందు ఆమె పాఠశాలను పరిశీలించి ప్రత్యేక తరగతులు కొనసాగుతున్న తీరు, ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతున్నాయా అని స్టాఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. వంటగది లేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని ఉపాధ్యాయులు, విద్యార్థులు సబ్‌కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ బిక్షపతి, ఎంఈఓ తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య తదితరులు ఉన్నారు.

## కడ్తాల్ ‘వై’ జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం



**ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి:** సోన్ మండలం కడ్తాల్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారి ‘వై’ జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, కడ్తాల్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడ్తాల్ జాతీయ రహదారి వై జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, వారి సమస్యను పరిష్కరించేందుకై సంబంధిత అధికారులందరితో ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించిందన్నారు. రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు, శాశ్వత పరిష్కారం పూర్తయ్యేలోపు తాత్కాలికంగా ప్రమాదాలను నివారించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రా రెడ్డిలు, ఆర్డీవో దుర్గప్రసాద్, సోన్ మండల తహసిల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్తులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల ఆందోళన..



సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్‌టిసి ఉద్యోగులు..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు నోటీసు ఇచ్చిన ఆర్‌టిసి జేఏసీ ముందస్తు మరోసారి ఆందోళన చేపట్టింది.నిర్మల్ డిపో దగ్గర ఆర్టీసీ ఉద్యోగులు అందులో చూస్తూ నిరాసన తెలిపారు.ఈ నెల 9వ తేదీ తర్వాత రాష్ట్ర జేఏసి నాయకులు పిలుపు మేరకు ఎప్పుడైన సరే మేము సమ్మెకు సిద్ధంగా ఉన్నామని గురువారం నిర్మల్ డిపో ఎదురుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆర్‌టిసికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 2017 పేస్కెలుకు సంబందించిన ఏరియకర్స్ చెలించాలి. ప్రభుత్వములో విలీనా ప్రక్రియ అమలుచేసి 2021,పేస్కెలు అమలు పరచాలి,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పించాలన్నారు. యూనియన్ లకు పునరుద్దించాలి. రిటైర్ ఉద్యోగులకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలి. డిఏ ఏరియర్స్ ఇవ్వాలన్నారు. పని భారం తగ్గించాలని, ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కలిపించాలన్నారు. ఈ డిమాండ్ లు నెరవేర్చకుంటే జేఏసి పిలుపు మేరకు సమ్మెకు సిద్ధంగా ఉన్నామని నిర్మల్ డిపో గేట్ ముందర ధర్నాకు దిగారు.

## బాధితులకు అండగా భరోసా సెంటర్లు

డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం/మంచిర్యాలప్రతినిధి:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల భరోసా సెంటర్ విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా డిసిపి భాస్కర్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి, బాధిత మహిళలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి భాస్కర్ మాట్లాడుతూ, భరోసా కేంద్రం మహిళలు, బాలికలకు న్యాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని, లైంగిక వేధింపులు, గృహహింసకు గురైన బాధితులకు సురక్షితమైన వాతావరణం, కౌన్సిలింగ్, వైద్యసహాయం అందించడంతో పాటు, పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు వరకు వారికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ భరోసా సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. భరోసా కేంద్ర సేవలను మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. బాధితుల మనోస్థితిని అర్థం చేసుకుని వారికి మద్దతుగా నిలుస్తున్న భరోసా సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఆర్. ప్రకాష్, రూరల్ సిఐ అశోక్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐలు సుగునాకర్, వినీత్, హైమ పాల్గొన్నారు.

## లైంగిక వేధింపులకు చెక్..




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** ఉద్యోగినిలు గౌరవప్రదంగా పనిచేయడానికి పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల రక్షణకై, మహిళా రక్షణకై రాజ్యాంగం పలు చట్టాలను ఏర్పాటు చేసిందని, అట్టి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. గురువారం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో న్యాయ సేవాసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగినులపై పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపుల అవగాహన, రక్షణ చట్టం 2013 పై స్థానిక వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల ఉద్యోగినిల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం సమాజంలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించిందని, మహిళల రక్షణకై ఉద్యోగినిలుగా సమాజంలో గౌరవప్రదంగా, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో పనిచేయడానికి వీలు కల్పిస్తు పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురికాకుండా రక్షణకై 2013 చట్టం ఏర్పాటు చేయబడిందన్నారు. పది మంది మహిళా ఉద్యోగినిలు పనిచేసే ప్రతి సంస్థ విధిగా ఇంటర్నల్ కమిటిలను ఏర్పాటు చేసుకోవాలని లేనియెడల రూ. 50 వేల జరిమానా, ఆ సంస్థ లైసెన్సులు రద్దు చేసే అధికారం చట్టానికి ఉందని అన్నారు. జిల్లా స్థాయిలో లోకల్ కమిటిలు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయన్నారు. ఈ చట్టం జిల్లాలో 2015 నుండి నిర్వహించబడుతుందని దీనికి ఛైర్‌పర్సన్‌గా న్యాయవాది నీరజా రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. సంస్థలు ఏర్పాటు చేసుకున్న ఇంటర్నల్ కమిటిలపై లోకల్ కమిటిల పర్యవేక్షణ చేయడంతో పాటు బాధిత మహిళకు సత్వర న్యాయం చేకూర్చే దిశగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా గృహ హింస చట్టం, ఫోక్స్ చట్టం రాజ్యాంగం మహిళలకు ప్రసాదించిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా స్థాయిలో పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు గురైన మహిళల రక్షణకై ఆన్‌లైన్‌లో షీ బాక్సులు స్త్రీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సెక్రెటరీ న్యాయమూర్తి పద్మావతి, జిల్లా సివిల్ జడ్జి కుష్బూ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి రసూల్ బి, నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట రెడ్డి, ఎస్ఐ రఘుపతి, ప్రసాద్, పాల్గొన్నారు.

## నలుగురు టీచర్లకు షోకాజ్ నోటీస్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లాలోని జియుపిఎస్‌య వినాయక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సమయంలో నలుగురు ఉపాధ్యాయులు పద్మావతి, బొద్దు భారతి, విజయశాంతి, కరుణశ్రీలు సమయానికి రాలేనందున వారికి షోకాజ్ నోటీస్ ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల సమయానికి ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావలని సూచనలిచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించటంతో పాటు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు.



## అడవి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టొద్దు



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ అటవీ ప్రాంతమైన ప్యారా నగర్ సమీపంలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టొద్దంటూ డిమాండ్ చేస్తూ గురువారం అఖిలపక్ష పార్టీల నాయకులు నర్సాపూర్ లో బందు చేపట్టారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోక్ కార్యక్రమం చేపట్టారు. ఈ రాస్తారోకో తో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆందోళనకారులు వినకుండా రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా నల్లవల్లి సమీపం లోని ప్యారానగర్ గ్రామ సమీపంలో డంపింగ్ యార్డ్ నిర్మించడం వల్ల హైదరాబాదులో సేకరించిన చెత్తాచెదారం వ్యర్థాలు ఇక్కడికి తీసుకువచ్చి పారబోయడం వల్ల ఇక్కడి గ్రామాలు దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. పచ్చని గ్రామాలు, అడవి చెత్తగా మారే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఈ డంపింగ్ యార్డ్ వల్ల నర్సాపూర్ రాయరావు చెరువు లోని నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని ఆమె మండిపడ్డారు. వెంటనే డంపింగ్ యార్డ్ నిర్మాణం విరమించుకోవాలని లేకుంటే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యదర్శి కాలేక్, నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, నాయకులు సత్యం గౌడ్, పంబళ్ల బిక్షపతి, పాల్గొన్నారు.

## సిర్పూర్‌లో తాగునీటి కష్టాలు గట్టెక్కేదెప్పుడో?



**ప్రజాపక్షం/ సిర్పూర్ (టి) :** మండలంలోని సోన్‌పేట ప్రభుత్వ పాఠశాలతో సహా పలు కాలనీల్లో తాగునీటి కష్టాలు తీవ్ర రూపం దాల్చాయి. గత నెల రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కొరత కారణంగా పిల్లలు దాహంతో కష్టాలు పడుతున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పలు కాలనీల్లో నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇతర మార్గాల్లో నీటి కోసం తపించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోయారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా, గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి రాకముందే నీటి సమస్య ఈ స్థాయికి చేరుకోవడం ఆందోళనకరం అని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలి

కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** మెదక్‌నిజామాబాద్‌కరీంనగర్‌ఆదిలాబాద్ శాసనమండలి ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్‌పి. శ్రీనివాస్ రెడ్డి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శుక్లా, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలిసి పట్టబద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నికలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది ఉపాధ్యాయులు, 6 వేల మంది పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, గోడ వ్రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే పోలింగ్ ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలోని ఓటరు హెల్ప్‌లైన్ నెంబర్ కోసం 1950 సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

